క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న పీడీ విమలారాణి

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలస గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి సోమవారం తనిఖీలు చేశారు. రికార్డులతో పాటు స్టాక్‌ను పరిశీలించారు.అనంతరం సిబ్బందికి పలుసూచనలు చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారన్ని బాలింతలు, గర్భిణులకు సక్రమంగా పంపిణీ చేయాలని, బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. కేంద్రాలకు గుడ్లు స్టాక్ వచ్చేటప్పుడు వాటి నాణ్యతను పరిశీలించాలని, నాణ్యత లేవనిపిస్తే తిరిగి వెనక్కి పంపించాలని సూచించారు.ఆమె వెంట సీడీపీఓ రాజేశ్వరి, సూపర్ వైజర్లు ఇందిర భవాని, శకుంతల ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో పేదలకు హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు సోమ వారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతీ నెల పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు అల్లు శ్రీని వాస్, సన్యాసినాయుడు, ఎం.తాతం నాయుడు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీఎస్టీ తొలగింపుతో పాలసీదారులకు ప్రయోజనం



కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహిస్తున్న బీఎం, అసోసియేషన్ ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీని తొలగించడం వల్ల పాలసీదారులకు ఆర్థిక భారం తగ్గుతుందని ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ బోని వెంకటకుమార్ తెలిపారు. బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం ఏఐఐ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ రద్దుతో పాలసీదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రామారావు, సిద్దార్థ, వెంకటేష్, సత్యనారాయణ, ఎల్లంనాయుడు, ఎం.పి.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను నియంత్రించాలని వినతి



తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మండల బీజేపీ అధ్యక్షుడు భాస్కర్

గజపతినగరం: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపుల నియంత్ర ణకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.రత్నకుమార్‌ను మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.భాస్కర్ కోరా రు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమ వారం ఆయన తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపులు పుట్ట గొడుగుల్లా వెలశాయని, మద్యం ఏరులై పారుతోందన్నారు. మండల బీజేపీ ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణ పార్టీ కార్యవర్గ సభ్యుడు పి.పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన



కేజీబీవీలో స్టాకును పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ప్రాథమికపాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల (కేజీబీవీ) పాఠశాలను ఎంఈఓ బాలభాస్కర రావు సోమవారం సందర్శించారు. కేజీబీవీలో రికార్డులు, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు.ఆరోగ్య జాగ్రత్తలు, పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలనే అంశాలపై సూచనలు చేశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనాలు అందించాలని ఎస్ఓ కిరణ్మయికి సూచించారు.

అన్నదాత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నేడు రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ పోరు

యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థల దృష్ట్యా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ స్థాయిలో 'ఎరువుల బ్లాక్‌మార్కెట్‌పై అన్నదాత పోరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. చీపురుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున రైతులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తూ రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఆర్డీఓకు వినతి పత్రం ఇవ్వనున్నారు. కార్యక్రమంలో శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డా.తలేరాజేష్, తదితరులు పాల్గొననున్నారు.

యూరియా సంగతేంటి సారూ..!

- రైతులకు అందని యూరియా ఎక్కడుంది?
- అన్నదాత ఎరువు పాట్లు పట్టించుకోరా?
- బస్తా యూరియా కోసం రోజంతా నిరీక్షణ
- అప్పటికీ ఎరువు దొరుకుతుందో లేదో తెలియని దుస్థితి
- నేడు డివిజన్ స్థాయిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు'



చీపురుపల్లి పట్టణంలోని శివరాం రోడ్డులో గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం అవస్థలు పడుతున్న రైతులు

చీపురుపల్లి: ఐదేళ్ల సజావుగా పంటలు సాగు చేసుకున్న రైతన్నలు మళ్లీ రోడ్డెక్కాల్సి వచ్చింది. ఎరువు కోసం ప్రైవేటు దుకాణాలు, పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకుంది. పోనీ రోజంతా ఉన్నా కనీసం ఒక్క యూరియా బస్తా అయినా దక్కుతుందా అంటే నమ్మకం లేదు. ఓ వైపు రోజూ యూరియా కోసం రైతుల అవస్థలు కళ్లెదుటే కనిపిస్తున్నా ఇటు వ్యవసాయ శాఖ అధికారులు, అటు పాలకులకు కనీసం చీమకుట్టినట్లు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో లక్ష్యం మేరకు యూరియా పంపిణీ పూర్తి చేశామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతుండగా... మరి రైతులు ఎందుకు యూరియా కోసం దుకాణాలకు ఎగబడాల్సి వస్తోందో అధికారులే చెప్పాలి. వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్న ప్రకారం యూరియా పంపిణీ పూర్తయితే ఆ యూరియా రైతులకు అందకుండా ఎవరు బ్లాక్ చేశారో వెలికితీయాలి.

ప్రణాళిక లేని వ్యవసాయ శాఖ.. పట్టించుకోని పాలకులు

ఖరీఫ్ సీజన్ వస్తుందంటే ముందుగానే వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలు చూస్తే వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన పాలకులు కూడా అదే ధోరణి అవలంబిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో 11,546 హెక్టార్లలో వరి, 4,310 హెక్టార్లలో మొక్క జొన్న పంట, ఇతర పంటలు మరో ఐదువేల హెక్టార్లలో సాగులో ఉన్నాయి. మొత్తం పంటలకు 2,500 టన్నుల యూరియా అవసరమని వ్యవసాయశాఖ ప్రతిపాదనలు చేసింది. దీని ప్రకారం పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, డీలర్లకు 2,684 టన్నుల యూరియా సరఫరాచేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఎరువు కోసం ఎందుకు పరుగులు తీస్తున్నారన్నది అధికారులకే తెలియాలి. సరఫరా చేసిన ఎరువు ఎవరి గోదాముల్లో డంప్ చేశారో వెలికితీయాలి. చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో 12 పీఏసీఎస్‌లు ద్వారా 800 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నా... అరకొరగానే పంపిణీ చేశారని రైతులు పేర్కొంటున్నారు.

యూరియా కొరత లేదు



సబ్ డివిజన్ పరిధిలో ఆగస్టు నుంచి ఇంతవరకు 2,684 టన్నుల యూరియా పంపిణీ చేశాం. సబ్ డివిజన్‌కు అవసరమైన యూరియా 2,500 టన్నులు మాత్రమే. అయినప్పటికీ మరో 1600 టన్నులు అదనంగా యూరియా పంపిణీ జరిగింది. ఇంకా రైతులు ఎందుకు దుకాణాల వద్ద లైన్లు కడుతున్నారో అర్థం కావడం లేదు.

– ఎస్.కోటేశ్వరరావు, ఏడీఏ, చీపురుపల్లి సబ్ డివిజన్

ఎరువుల పంపిణీలో ప్రభుత్వం విఫలం



తహసీల్దార్ రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ కార్యదర్శి అప్పారావు, తదితరులు

గజపతినగరం: రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రభుత్వ చేతకాని తనంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోందని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పురం అప్పారావు మండిప డ్డారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నదాతలు విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడుతూనే ఉన్నారని ఆరోపించారు. ఖరీఫ్ వరితో పాటు ఇతర పంటలకు ఎరువులు వేయాల్సిన సమయంలో రైతులకు ఎరువులు లభించకపోతుండడంతో అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. మండలంలో రైతు సేవా కేంద్రాల వద్ద అన్నదాతలు రోజంతా గంటల తరబడి క్యూలో నిల్చొని తోపులాటలు ఆడుకోవాల్సి వస్తోందని, వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల్లో అధికార పార్టీ సానుభూతిపరులకే యూరియా అందుతోందని ఆరోపించారు. టోకెన్ సిస్టమ్ ద్వారా ప్రతీ రైతుకు యూరియా అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

గంట్యాడ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని చెప్పారు. పలుచట్టాల గురించి వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు రక్షణ, సంరక్షణ, వైద్య, న్యాయ సహాయం కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలని సూచించారు.హెల్ప్ లైన్ నెంబర్ 181కు ఫోన్ చేస్తే సహాయం అందుతుందని అన్నారు. బాల్య వివాహాలు నిరోధానికి, తప్పి పోయిన బాలలు, బాలకార్మికుల గురించి చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయి విజయలక్ష్మి, ఎస్ఐ సాయి కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ జి.జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రవికిరణ్

శృంగవరపుకోట: సాధారణ యూరియా కంటే ద్రవ రూపంలోని నానో యూరియా వాడడం అన్ని విధాలా మేలని మండల ప్రత్యేకాధికారి రవికిరణ్ రైతులకు సూచించారు. ధర్మవరం గ్రామంలో రైతులతో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా వినియోగంపై రైతులు ఆసక్తి చూపాలన్నారు. మండల రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన పని లేదని, మండలంలో 48మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని, మరో రెండు రోజుల్లో 40 మెట్రిక్ టన్నులు వస్తుందని చెప్పారు. ప్రస్తుతం యూరియా పంపిణీ చేస్తున్న జేకే అగ్రి ఇండియా ట్రేడర్స్, కె.ఎం.పురం పీఏసీఎస్, పెదఖండేపల్లి ఆర్ఎస్‌కేలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ సన్యాసయ్య, మండల వ్యవసాయాధికారి కె.రవీంద్ర, ఎంపీడీఓ సతీష్ ,తదితరులు పాల్గొన్నారు.


సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

చీపురుపల్లి: సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, వారికి ఉద్యోగ భద్రత చట్టం చేయాలని ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అందించే విధంగా మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని, గతంలో జరిగిన సమ్మె ఒప్పందాలను అమలు చేసి వేతన పెంపు కల్పించాలని కోరారు. ఉద్యోగులకు ఈపీఎఫ్ ,గ్రాట్యుటీ, మెడికల్ సెలవులు, హెల్త్ కార్డులు వంటి హక్కులు కల్పించాలని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఏర్పడి 10 ఏళ్ల పూర్తయిన సందర్భంగా అక్టోబర్–12న దశాబ్ద ఐక్యత–భవిష్యత్తు పోరాట సభను విజయవాడలో గల ఎంబీవీకేలో నిర్వహిస్తున్నామని, ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, వి.రమేష్, నియోజకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 8 నుంచి 15వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కళాశాల ఉప ప్రధానాచార్యులు ఎం.రమేష్‌కుమార్ తెలిపారు. పీజీ ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థులు httpr://cetr.aprche.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వెబ్ ఆప్షన్స్ ఈ నెల 12 నుంచి 17వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 40 సీట్లు, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సులో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాలేజీలో ప్రవేశం పొందేందుకు కాలేజీ కోడ్ AUGCF. వివరాలకు 91821 88677 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం



వేపాడ: సోంపురం హైస్కూల్‌లో 'అ' అక్షర రూపంలో కూర్చున్న విద్యార్థులు

శృంగవరపుకోట: ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైఆర్‌సీ, ఎన్ఎస్ఎస్ విభాగాల నేతృ త్వంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అధ్యాపకుడు డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ 1967నుంచి ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. శాంతియుత, స్థిర సమాజం ఆవిష్కరణకు అక్షరాస్యత దోహదం చేస్తుందన్నారు. వైఆర్‌సీ కో–ఆర్డినేటర్ సీహెచ్. శ్రీనివాసరావు, ఉపన్యాసకులు డాక్టర్ ఆర్.శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓ భాస్కర్, బి.సంధ్యారాణి, అప్పలరాజు, శివకుమార్ పాల్గొన్నారు.

సోంపురం హైస్కూల్‌లో..

వేపాడ: సోంపురం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.పి.ఏ.రాజు నేతృత్వంలో సోమవారం అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు 'అ' అక్షర రూపంలో కూర్చుని ప్రదర్శన ఇచ్చారు. అంతకుముందు 'నేను ఎందుకు చదవాలి' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.గోవిందరావు, తెలుగు ఉపాధ్యాయుడు వి.జగన్నాథం పాల్గొన్నారు.

• కోతకు గురైన రోడ్డు పరిశీలన



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: కోమటిపల్లి–దత్తిరాజేరు రోడ్డులో గొభ్యాం కూడలి వద్ద కోతకు గురైన బీటీ రోడ్డును ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు,మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు సమస్యపై పలుమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ స్థానిక మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టించుకోలేదని ఆరోపించారు. రోడ్డుపై చిన్న గుంత ఉన్నప్పుడు పట్టించుకుంటే నేడు రోడ్డు మొత్తం కోతకు గురయ్యేది కాదని అన్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు



పెదవేమలి- కోరుకొండపాలెం రోడ్డులో కూలిన చెట్టు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి, విజయనగరం మండలం కోరుకొండపాలెంకు వెళ్లే దారిలో సోమవారం కురిసిన వర్షానికి చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది.దీంతో ఇరుగ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. స్థానిక సర్పంచ్ స్పందించి చెట్టును తొలగించడంతో రాకపోకలకు మార్గం సుగుమం అయ్యింది.

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయండి

- ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన
- రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ



జామిలో అన్నదాతపోరు వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



గజపతినగరం రూరల్: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు



దత్తిరాజేరు: వాల్ పోస్టర్లనువిడుదల చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు



బొండపల్లి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గంట్యాడ: వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ నరసింహమూర్తిచ తదితరులు

జామి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తోందని, రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ గొర్లె సరయు,ఎంపీపీ సబ్బవరపు అరుణ ఆరోపించారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను, కృత్రిమ కొరత సృష్టించడాన్ని నిరసిస్తూ రైతన్నలకు మద్దతుగా విజయనగరం ఆర్డీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మంగళవారం 'అన్నదాత పోరు' కార్యక్రమం నిర్వహించ నుందని వారు చెప్పారు. 'అన్నదాత పోరు' వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 'అన్నదాత పోరు' కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు గ్రామాల్లోనే ఎరువులు విత్తనాలు అందేవని, కూట మి ప్రభుత్వంలో ఒక్క బస్తా యూరియా కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చలుమూరి సత్యారావు, పార్టీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు అప్పాన సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యక్షుడు కిలారి సూర్యారావు,బూత్ కమిటీల ఇన్‌చార్జ్‌లు ఎన్నింటి శేషు, సింగారపు అప్పలరాజు,నేతలు పిన్నింటి రవికుమార్,పిన్నింటి అప్పలనాయుడు, సంతోష్,చుక్క వెంకట రావు,శీరెడ్డి చందునాయుడు, జన్నేల సూరిదేముడు,శ్రీనివాస్ పాల్గొన్నారు.

తరలిరండి

గజపతినగరం రూరల్: జిల్లా కేంద్రంలోని మంగళవారం నిర్వహించనున్న 'అన్నదాతపోరు' కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతన్నలు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'అన్నదాతపోరు' వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. జెడ్పీటీసీ గార తవుడు, నాయకులు మండల సురేష్,బెల్లాన త్రినాథరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం తీరుతో రైతులకు కష్టాలు

బొండపల్లి: కూటమి ప్రభుత్వం తీరుతో రైతులు వ్యవసాయం చేసుకునేందుకు కష్టాలు పడాల్సి వస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నం నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించనున్న 'అన్నదాత పోరు'కు సంబంధించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ బూత్ ఇన్‌చార్జ్‌లు మహంతి రమణ, పల్లి రఘు, తాడ్డి చందు, పార్టీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సాలపు పెంటం నాయుడు, నాయకులు చలంనాయుడు, తాళ్లపూడి అప్పలనాయుడు, పెద్ద మజ్జి గోపి, సర్పంచ్‌లు మునకాల పైడిపు నాయుడు, ఎస్.ఆదినారాయణ, కర్రోతు శ్రీనివాసరావు, అప్పారావు, పిరాము పాల్గొన్నారు.

బొబ్బిలి తరలిరండి

దత్తిరాజేరు: బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న 'అన్నదాత పోరు' కార్యక్రమానికి మండల రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున కోరారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ ఫణీంద్రుడు నివాసం వద్ద 'అన్నదాత పోరు'వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, ఎంపీటీసీ అలజంగి అప్పలనాయుడు, సీనియర్ నాయకులు సుమల గోవింద్, మండల శ్రీను పాల్గొన్నారు.

యూరియా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం

గంట్యాడ: అందరికి అన్నం పెట్టే రైతన్నకు యూరియా అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించనున్న' అన్నదాత పోరు' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను రామవరం గ్రామంలో మంగళవారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహిండ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, యువజన విభాగం అధ్యక్షుడు కొండెల విజయ్, ఉపాధ్యక్షుడు పి.వెంకటరావు,మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అలమండ మహేష్, పార్టీ నాయకులు పి. నారాయణమూర్తి, జాగరపు సత్యారావు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు మృతిచెందిన మేకల పరిశీలన

వేపాడ: కొండగంగుబూడి గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగు పాటుకు గ్రామానికి చెందిన గలారి పదసాహెబ్, సార ఎర్రయ్యమ్మ, సారా బుచ్చమ్మ, గలారీ కేకులుకు సంబంధించిన 30 మేకలు చనిపోయాయి. తహసీల్దార్ రాములమ్మ సోమవారం వీటిని పరిశీలించారు. వీటికి పశువైద్యాధికారి పోస్టుమార్టం చేశారు. నష్టం అంచనా వేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు.



మృతిచెందిన మేకలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాములమ్మ